www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శుక్రవారం
25 ఏప్రిల్ 2025

విలేఖరులు కావలెను


కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు
జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను.
తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు..
సమకాలీన రజకీయాలు, సామాజిక
అంశలపై అవగాహన ఉండి..
రియగల వరికి 'కలంజ్యోతి'
సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003

# ఉగ్రవాదులను మట్టిలో కలిపేస్తాం

## ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరిక


పాట్నా : ఉగ్రవాదులను, ఉగ్రభూమిని మట్టిలో కలిపే సమయం ఆసన్నమైందని, వారి నడ్డి విరిచేస్తామని ప్రతీ ఉగ్రవాదిని భారత్ శిక్షిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పహల్గామ్ దాడికి పాల్పడిన వారు, దాడికి బాధ్యులైన వారికి వారు ఊహించిన దానికంటే పెద్ద శిక్షే విధిస్తామన్నారు. దేశ శత్రువులు భారతస్వాభిమానం, గౌరవాలపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిపై దేశం క్షోభతో, బాధతో ఉందని మోదీ అన్నారు.

**140 కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తాం..**

బిహార్ మధుబనీలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఆ నెల 22వ తేదీన పహల్గామ్ లో అమాయకులైన దేశవాసులను పొట్టన పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశమంతా నేడు ఆ కుటుంబాలకు మద్దతుగా ఉందన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉగ్రదాడుల్లో కుమారుడు, సోదరుడు, భర్తలను పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడుల్లో మృతి చెందిన వారు వివిధ భాషల వారు ఉన్నారని అన్నారు. ఇక ఉపేక్షించేది లేదని, ఉగ్రభూమిని కూడా మట్టిలో కలిపేస్తామన్నారు. దాడికి కారణమైన వారికి ఊహించని రీతిలో శిక్షిస్తామన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్ష ఇక నెరవేరబోతుందన్నారు. బిహార్ నుంచి ప్రపంచానికి చెబుతున్నానని, భారత్ ప్రతి ఉగ్రవాదిని శిక్షిస్తుందని ప్రతిజ్ఞ చేశారు. శాంతి, అభివృద్ధికి ఉగ్రవాదం పెనుముప్పను విఘాతాన్ని కలిగిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

**గ్రామ పంచాయతీల అభివృద్ధి..**

ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందుగా పహల్గామ్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. బిహార్ లో అనేక అభివృద్ధి పనులు చేపట్టి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. భారత గ్రామాలు ఎప్పటి వరకు అభివృద్ధి కావో అప్పటి వరకు దేశ అభివృద్ధి చోటు చేసుకోదని బాపూ (మహాత్మాగాంధీ) భావించేవారన్నారు. సాంకేతికత ద్వారా తమ ప్రభుత్వం గత పదేళ్లలో 2 లక్షల గ్రామ పంచాయితీలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించామన్నారు. పంచాయితీలు డిజిటల్ కావడంతో మరణ, జనన, భూముల పత్రాలు సులువుగానే లభిస్తున్నాయన్నారు.



- పాక్ కు ఊహించని శిక్ష విధిస్తాం
- ఉగ్ర భూమికి అదే గతి
- పహల్గామ్ లో సోదరుడు, కుమారులు, భర్తలను కోల్పోయారు
- దేశం క్షోభతో ఉంది
- భారత స్వాభిమానంపై దాడి
- మధుబనీలో అభివృద్ధి పనుల ప్రారంభం




## ఆరుగురు మావోల హతం

- కర్రెగుట్టల్లోని భీమవరంపాడు, పూజారీ కాంకేర్, పామేడు అటవీ ప్రాంతాల్లో కాల్పుల మోత
- హెలికాప్టర్లు, డ్రోన్ల సాయంతో దాడులు
- ఆపరేషన్ లో 20 వేల బలగాలు!
- గుట్టలపై వేల సంఖ్యలో మావోయిస్టులు
- ఛత్తీస్‌గఢ్‌తెలంగాణ సరిహద్దులో హైటెన్షన్!

2లో



## కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ

**కలంజ్యోతి, మల్యాల :** మండలలోని నూకపల్లి, బల్వంతపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 24 గంటలలోపు రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల్లో ప్యాడి క్లినర్స్, నీటివసతి, ఓఆర్ఎస్ పాకెట్స్ అంటుదుబాటులో ఉంచాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా హమాలీలు ఉదయం, సాయంత్రం వేలాల్లో పనులు చేయాలన్నారు.



## బోటనీలో శివకుమార్ కు డాక్టరేట్

### హర్షం వ్యక్తం చేసిన రత్నగిరి గ్రామస్తులు

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని రత్నగిరి గ్రామానికి చెందిన అంబీరు శివకుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి బొటనిలో పీహెచ్ డీ పట్టా అందుకున్నారు. శివకుమార్ రాసిన థీసిస్ 'ఇన్విట్రో ప్రో పేగేషన్, ఫీటో కెమికల్ అండ్ మొలిక్యులర్ ఎనాలసిస్ ఆఫ్ జింజిబర్ జెరుంబెట్' అనే అంశంలో ఈ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సూపర్వైజర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి చేతుల డాక్టరేట్ అందుకున్నారు. మారుమూల గ్రామంలో జన్మించి స్వయంకృషితో, పట్టుదలతో పీహెచ్ డీ సాధించడం పట్ల రత్నగిరి గ్రామస్తులు, తల్లిదండ్రులు కుమారస్వామి శారద ఆనందం వ్యక్తం చేశారు. శివకుమార్ డాక్టరేట్ పొందడం పట్ల ముల్కనూర్ విశ్వశాంతి హై స్కూల్ డైరెక్టర్లు కాశిరెడ్డి ఆదిరెడ్డి, దస్తరి ఉమా మహేశ్వర్, సిహెచ్ గోపాల్ రెడ్డి వర్షం వ్యక్తం చేశారు.



## డ్రగ్స్ నిర్మూలనకు పోరుయాత్ర

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** నాలుగు రోజులుగా మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలో ప్రారంభమైన డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర మండలంలోని అన్ని గ్రామాలను చుట్టేసింది. జేఏసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పరిచారు. శుక్రవారం ముల్కనూర్ వెంకట సాయి గార్డెన్ లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర ముగుస్తుందని కవ్వ లక్ష్మారెడ్డి తెలిపారు. మండల ప్రజలు ముగింపు సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేత కవ్వ లక్ష్మారెడ్డి, నియోజకవర్గం హుస్నాబాద్ కో.ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, అంబేద్కర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ, ఆశీర్వాదం, మొగిలి, డాక్టర్ తిరుపతి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాంబుల వర్షం!



**కలంజ్యోతి, చర్ల :**
కర్రెగుట్టలపై బాంబుల వర్షం కురుస్తున్నది. నక్సలైట్లే టార్గెట్ గా గుట్టల ఉపరితలం నుంచి హెలికాప్టర్లు, డ్రోన్లతో బాంబుల వర్షం కురుస్తుండగా.. గుట్టల నలువైపుల నుంచి బలగాలు బుల్లెట్లను కుమ్మరిస్తున్నాయి. ఫలితంగా ఆరుగురు మావోయిస్టులు మరణించినట్టు తెలుస్తున్నది. మరో ఇద్దరు జవాన్లకు గాయాలైనట్టు తెలుస్తున్నది. ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నది. బీజాపూర్ అడవుల్లో 1000కి పైగా మావోయిస్టులు ఉన్నట్టు పక్కా సమాచారం అందుకున్న భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి.

**రెండు రోజులుగా బాంబుల వర్షం..**

ఛత్తీస్‌గఢ్‌తెలంగాణ సరిహద్దులో టెన్షన్ వాతావరణం కొనసాగుతున్నది. కర్రెగుట్టలపై రెండు రోజులుగా బాంబుల వర్షం కురిపిస్తున్నాయి కేంద్ర బలగాలు. మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారన్న సమాచారంతో హెలికాప్టర్లు, డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. బీజాపూర్ అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. దాదాపు 1000 మంది మావోయిస్టులను సుమారు 20వేల మంది భద్రతా సిబ్బంది చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ ఉదయం ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కర్రెగుట్టల కేంద్రంగా అగ్ర నేతలు, మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్రెగుట్టలలో దాదాపు 1000 మంది మావోయిస్టులు దాగి ఉన్నట్లు సమాచారం. అగ్రనేత హిడ్మా నేతృత్వంలో వీరంతా అక్కడకు చేరినట్లు తెలుస్తోంది. వీరిలో కమాండర్ స్థాయి నేతలు, మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. భీమవరంపాడు, పూజారీ కాంకేర్, పామేడు అటవీ ప్రాంతాల్లో కాల్పుల మోత మోగుతోంది. కూంబింగ్ నేపథ్యంలో కర్రెగుట్ట దండకారణ్యంలోని పలు గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు.

**రంగంలోకి మరిన్ని బలగాలు..**

రెండు రోజులుగా ఈ కూంబింగ్ కొనసాగుతోంది. మందుపాతరలు అమర్చామని ఇప్పటికే మావోయిస్టులు లేఖల ద్వారా ప్రకటించారు. ప్రజలు ఎవరూ అటవీ ప్రాంతంలోకి రావొద్దని హెచ్చరించారు. దీంతో గాలింపు అత్యంత అప్రమత్తంగా కొనసాగుతోంది. బుధవారం 18 వేల మందితో కూంబింగ్ చేపట్టగా.. గురువారం ఉదయం అదనంగా మరో 2 వేల మందిని రప్పించారు. దీంతో ఈ 20 వేల మంది భద్రతా సిబ్బంది కర్రెగుట్టల అటవీప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. కర్రెగుట్టల ఏరియాను కలిపే గ్రామాలకు రాకపోకలను సైతం బలగాలు మూసివేశాయి. మరోవైపు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలంటున్న పౌరహక్కుల నేతలు కాల్పులు తక్షణం ఆపేయాలని డిమాండ్ చేస్తున్నారు. తాజా పరిణామాలతో ఏజెన్సీ గ్రామాల్లో భయానక వాతావరణం నెలకొంది.



# చేపల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలి

### మత్స్యశాఖ జిల్లా అధికారి ఆర్.అవినాష్

**కలంజ్యోతి, మంచిర్యాల :** వేసవి వాతావరణ పరిస్థితులలో చేపల పెంపకంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్. అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు చేపల పెంపకాన్ని ప్రభావితం చేస్తాయని, జలాశయాలలో నీటి మట్టం క్రమేపీ తగ్గుతుందని, ఈ విషయమై మత్స్యకారుల సంఘాలు, సభ్యులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. సంఘం పరిధిలో చెరువులు, కుంటలలో నీటి మట్టం తగ్గితే త్వరగా చేపలు పట్టుకోవాలని తెలిపారు. 2024 25 సంవత్సరానికి లీసు (చెరువు రకం) చెల్లించి చేపలు పట్టుబడి చేయాలని తెలిపారు. జిల్లాలోని మత్స్యశాఖ సంఘం పరిధిలోని 368 చెరువులు, కుంటలలో చేపల రక్షణకు సూచనలు పాటించి రాబడి పొందాలని సూచించారు.



కలంజ్యోతి 3
శుక్రవారం 25.04.2025 General News

# ఈతకెళ్తున్నారా.. జరభద్రం

- పిల్లలు, యువకుల్లో స్విమ్మింగ్‌పై ఉత్సాహం
- చెరువులు, కుంటలకు వెళ్లి ప్రమాదాలు
- ఏటా పదుల సంఖ్యలో నీటిలో కలుస్తున్న ప్రాణాలు
- యువతకు జాగ్రత్తలు తప్పనిసరి
- తల్లిదండ్రులూ ఓ కంట కనిపెట్టాలని సూచనలు
- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్





**కలంజ్యోతి, జగిత్యాల :** వేసవికాలంలో వచ్చేసిందంటే యువత ఈత నేర్చుకునేందుకు మొగ్గు చూపుతుంటారు. చెరువులు, కుంటలు, బావులను ఆశ్రయిస్తున్నారు. దాంతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా పిల్లలు, యువకులు ఈత నేర్చు కోవడం వాటివైపు పరుగులు పెడుతున్నారు. ఈతలు కొడుతూ కేరింతలు కొడుతున్నారు. వేసవి తాపం తీర్చుకోవడానికి కొందరు, ఈత నేర్చుకో వడానికి మరి కొందరు, సరదాగా గడిపేందుకు ఇంకొందరు.. నీళ్లలో దూకి తమ ఈత సరదా తీర్చుకుంటున్నారు. ఇక పాఠశాలలకు సెలవులు ప్రకటించిన తర్వాతనైతే విద్యార్థుల ఆటపాటల్లో ఈత ఓ భాగమైపోయింది. అయితే, కొన్ని సందర్భాల్లో ఈత విహారం విషాదానికి దారితీస్తున్నది. వినోదాన్ని పంచిన ఆ నీరే.. విషాదం వైపు చీకట్లోకి నెట్టివేస్తున్నది. నీటిలో చేపపిల్లలా ఈదుతూ గెంతులేసిన పిల్లలు.. అదే నీటిపై విగత జీవులుగా తేలియాడాల్సి వస్తున్నది. ఎన్నో ఆశలు పెట్టుకున్న కన్నా తల్లితండ్రులకు గర్భశోకాన్ని మిగులుస్తున్నారు. నీటి విషయంలో అవగాహన లేకపోవడం, తోటి వారు ఈత కొడుతుండగా ఉత్సాహాన్ని ఆపుకోలేక, ఈత రాకున్నా నీటిలోకి దిగడం, ప్రవాహ నీటిలో ఈత కొట్టడం, చెరువులు, బావు లు, కాలువల్లో ఈత పేరుతో ప్రయోగాలు చే యడం, చేపలు పట్టేందుకు పెట్టిన వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌కు గురికావడం వంటి కారణాల వల్ల ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటివి జరగకుండా ఉండా లంటే జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

ఒంటరిగా ఈతకు వెళ్లరాదు.
పదిహేనేండ్ల లోపు వయసు వారిని ఒంటరిగా ఈతకు వెళ్లనీయొద్దు.
చిన్నారుల భద్రతను మరో చిన్నారిపై ఉంచొద్దు.
తప్పనిసరిగా తండ్రి లేదా పెద్దవారు వెంట ఉండాలి.
పిల్లల ఈతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి.
తల్లిదండ్రుల, పెద్దల అనుమతి తీసుకుని పూర్తి స్థాయి రక్షణ చర్యలు తీసుకున్న తర్వాతే ఈతకు వెళ్లాలి.
ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే వెళ్లాలి.
ఈత నేర్చుకునే సమయాల్లో గాలి ట్యూబులు, ఇతర రక్షణ కవచాలను నడుముకు, హ్యాండ్ ట్యూబులు కట్టుకోవాలి.
పెద్దలు, శిక్షకుల సమక్షంలోనే ఈత నేర్చుకోవాలి.
నీటిలో అడుగు భాగాలకు వెళ్లి మట్టిని తేవడం, ఎవరు ఎక్కువ సేపు నీటిలో మునిగి ఉంటారనే పోటీలు, ఇతర ఆటలు ఆడవద్దు.
నీటిలో ఎక్కువ సేపు మునిగి ఉండవద్దు.
నదులు, కాలువల్లో ఈత కొట్టవద్దు.
తలవెంట్రుకలు కండ్లలోకి రాకుండా హెడ్ క్యాప్, చెవుల్లోకి నీళ్లు పోకుండా ఇయర్ ప్లగ్‌లను ఉపయోగించాలి.
ఈతకు వెళ్లే ముందు ఎక్కువగా ఆహారం తీసుకోరాదు.
హృద్రోగులు, మూర్చ, హైబీపీ ఉన్న వారు నీటిలోకి వెళ్లకపోవడమే మంచిది.
ఈతకు వెళ్లే సమయంలో సెల్ ఫోన్, ఫస్ట్ ఎయిడ్ కిట్ తీసుకెళ్లాలి.
నీటిలో మునిగిన వ్యక్తిని, కొట్టుకుపోయే వ్యక్తిని కాపాడే ప్రయత్నం చేసే వారు సైతం రక్షణ చర్యలు తీసుకోవాలి.
నీటిలో ప్రమాదం జరిగినప్పుడు ఒడ్డున ఉన్న వారు కేకలు వేస్తూ సమీపంలోని పెద్దవారికి సమాచారాన్ని చేరవేయాలి.

**తలిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి**

పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు, యువకులు జలాశయాలు, కాలువల్లో ఈతకు వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరగకుండా వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి. ఈత కొట్టే సమయంలో పెద్దలు వెంట ఉండాలి. ఈత రాని పిల్లలను ఒంటరిగా చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్లకుండా చూడాలి. తల్లిదండ్రులు, పెద్దలు, నిపుణుల సమక్షంలోనే ఈత నేర్చుకునేలా చూడాలి. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో జలాశయాలు, కాలువల వద్ద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలి. నీటి ప్రమాదాలు జరుగకుండా పోలీసు శాఖ ద్వారా చర్యలు తీసుకోవాలి.






# రైతు భూములకు పూర్తి భరోసా

## కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే సత్యం

**కలంజ్యోతి, మల్యాల :** భూ భారతితో భూములకు పూర్తి భరోసా కల్పించనున్నట్టు కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే సత్యం అన్నారు. గురువారం మండలం కేంద్రంలోని ముత్యంపేట రెడ్డి ఫంక్షన్ హాల్ లో తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ శాఖ భూభారతిఆర్వోఆర్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడారు. ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ధరణి పోర్టర్ లో ఎదుర్కొన్న అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా దొరుకుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా భూములకు సంబంధించిన అవినీతిని అరికట్టి, రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. రైతులకు మేలు జరిగేలా భూ వివాదాలు లేని చట్టంగా ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ముత్యాల రాంలింగా రెడ్డి, బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, దారం ఆదిరెడ్డి, సంత ప్రకాష్ రెడ్డి, ఆనందరెడ్డి, లక్ష్మారెడ్డి, సతీష్ రెడ్డి, శనిగరపు తిరుపతి, అనిల్ కుమార్, కోరేపు వెంకటేష్, జీవనరెడ్డి, ఇమామ్, తహసీల్దార్ మునిందర్, ఎంపీవో స్వాతి, సీఐ నీలం రవి, ఎస్ఐ నరేష్ కుమార్, రైతులు, అధికారులు, పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.



# వడదెబ్బతో యాచకుడు మృతి



**కలంజ్యోతి, మల్యాల:** మండలంలోని కొండగట్టు గుట్ట కింద యాచకుడు మరణించారు. గురువారం గ్రామపంచాయతీ సిబ్బంది శానిటైజేషన్ పనులు నిర్వహిస్తుండగా జలబుగ్గ ప్రాంతంలో తోకల జనార్ధన్ కి చెందిన ఓపెన్ స్లాబ్ ల కింద భిక్షాటన చేసుకునే ఒక గుర్తుతెలియని మృతదేహం కనిపించింది. సుమారు 70 ఏళ్ల పైబడే ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న ముత్యంపేట కారోబార్ పైడిపల్లి రాజేశ్వర్.. ఎస్సై నరేష్ కుమార్ కు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



## జీపీఓలతో భూ సమస్యలకు పరిష్కారం

### కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** గ్రామ పాలనాధికారుల నియామకంతో భూసమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా భూభారతి చట్టంపై కొనసాగుతున్న అవగాహన సదస్సుల్లో భాగంగా గురువారం నర్సాపూర్ మండల కేంద్రంలోని అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భూ సమస్యలు సులువుగా పరిష్కరించేందుకు వీలుగా నూతన భూభారతి చట్టం రూపొందిమన్నారు. గ్రామాల్లో గ్రామపాలన అధికారులను నియమించడం ద్వారా, ప్రజల భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఎంతోమంది అనుభవజ్ఞులైన అధికారులు, భూ చట్టాల నిపుణులు, న్యాయ నిపుణులు నేతృత్వంలో సమగ్ర భూభారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు. నూతన భారతి చట్టం అమలుతో తహసీల్దార్ స్థాయిలోనే ఎన్నో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అన్ని భూసమస్యల దరఖాస్తుల పరిష్కారానికి నిర్ణీత గడువును విధించారని తెలిపారు. సాదా బైనామా ప్రక్రియ తిరిగి వినియోగంలోకి రాబోతుందన్నారు. భవిష్యత్ లో ఎటువంటి భూసమస్యలు తలెత్తకుండా ఉండేందుకై రైతుల పట్టాదారు పాసు పుస్తకంలో వారి భూములకు సంబంధించి వివరాలను మ్యాపింగ్ రూపంలో పొందుపరుస్తారన్నారు. సమావేశంలో భాగంగా రైతుల ఎదుర్కొంటున్న పలు భూ సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్, రైతులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పాక్ సైన్యం చేతిలో బందీగా బీఎస్ఎఫ్ జవాన్

**కలంజ్యోతి, న్యూఢిల్లీ :** పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ తో భారత్ తెగతెంపులు చేసుకోవడానికి సిద్ధమైన తరుణంలో బీఎస్ఎఫ్ జవాన్ ఒకరు పాక్ సైన్యం చేతిలో బందీ అయ్యారు. అనుకోకుండా పంజాబ్‌లోని ఫెరోజ్‌పూర్ బోర్డర్ దాటిన క్రమంలో పీకే సింగ్ అనే జవాన్ ను పాక్ సైన్యం అదుపులోకి తీసుకుంది. దీనిపై పాకిస్తాన్ సైన్యంతో భారత్ సైన్యం చర్చలు జరుపుతుంది. పాక్ చేతిలో బందీగా మారిన భారత్ జవాన్ ను సురక్షితంగా విడిచిపెట్టాలని బీఎస్ఎఫ్ అధికారులు.. పాక్ బోర్డర్ సెక్యూరిటీ అధికారిని కోరారు. అది యాదృచ్ఛికంగా జరిగిన ఘటనేనని, సదరు జవాన్ కావాలని పాక్ బోర్డర్ లో అడుగుపెట్టలేదనే విషయాన్ని తెలిపినట్లు భారత్ కు చెందిన బీఎస్ఎఫ్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

**కలంజ్యోతి, మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన ఏ.వీరయ్యను జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానంలో కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# ఉచిత నైపుణ్య శిక్షణకు ఏర్పాట్లు

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



**కలంజ్యోతి, మంచిర్యాల :** ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఉచితంగా అందించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్మెంట్ (టాస్క్) ద్వారా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారి సంతోష్, టాస్క్ ఆర్.సి. మేనేజర్ జి. సాయికుమార్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 30 రోజుల పాటు అర్హత గల యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించి వారి ఉపాధి అవకాశాలను పెం పొందిస్తామన్నారు. కార్యక్రమంలో సీ, సీ++, జావా, పైథాన్, ఆప్టిట్యూడ్ రీజనింగ్, ఇంటర్వ్యూ నైపుణ్యాలలో శిక్షణ అందించనున్నట్టు తెలి పారు. అభ్యర్థుల వయస్సు 1830సంవత్సరాల మధ్య ఉండాలని, డిగ్రీ, డిప్లొమా, బి.టెక్ పూర్తి చేసి ఉండాలని వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోగా తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 28వ తేదీన శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

# అర్చక ఉద్యోగ జేఏసీ డైరీ ఆవిష్కరణ

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** కొత్తకొండ వీరభద్రస్వామి సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ డైరీని ఆ సంఘ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చక ఉద్యోగుల సమస్యలపై సమావేశంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కశ్మీర్లో హిందువులపై ఉగ్రదాడి పైశాచికత్వంపై తమ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గంగు ఉపేందర్ శర్మ, కొత్తకొండ దేవాలయ అర్చకులు, సిబ్బంది అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు ఉపేందర్ శర్మకు సన్మానం చేసి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి వేదమంత్రాలతో అర్చకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య అర్చకులు రాంబాబు, శ్రీకాంత్ శర్మ, అర్చకులు వినయ్ శర్మ, శివకుమార్, శరత్చంద్ర, సందీప్, శ్రవణ్, రవిశర్మ పాల్గొన్నారు.



# భానుడి భగభగ

### ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

### 42 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

**కలంజ్యోతి, హైదరాబాద్ :** భానుడి భగ భగలతో తెలంగాణవాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గత రెండు రోజు లుగా పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు నమోదు కాగా, బుధవారం మలక్‌పేట ముసారాం బాగ్, బోయిన్‌పల్లి, ఉప్పల్ ప్రాంతాల్లో 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మియాపూర్, అత్తాపూర్, నాచారం, వినాయకనగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో 42 డిగ్రీలు, అంబర్‌పేట, మెహిదీపట్నం, ముషీరాబాద్, న్యూమెట్టుగూడ ప్రాంతాల్లో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం వడగాలులు వీచడంతో ప్రధాన రహదారులపై వాహనాల సంఖ్య సగానికిపైగా తగ్గిపోయింది. ఉదయం 9 గంటల నుంచే ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఏప్రిల్ 30 నాటికి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలు పెరిగే అవకాశముంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు 27.2 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో వేడిగాలుల ప్రభావం రాత్రిళ్లు కొనసాగుతున్నది. కాగా, గతేడాది ఏప్రిల్ 23న గ్రేటర్ లోని పలు ప్రాంతాల్లో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# ఊహించని లుక్‌లో దర్శనమిచ్చిన నిధి

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ నిధి అగర్వాల్ రెండేళ్లుగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న ఆమె వరుస చిత్రాల్లో నటిస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. ప్రజెంట్ ఈ అమ్మడు పవన్ కల్యాణ్, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన నటించబోతుంది. హరిహర వీరమల్లు, ది రాజాసాబ్ వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తున్న ఆమె నిత్యం వార్తల్లో నిలుస్తోంది. అయితే షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ రెండు భారీ బడ్జెట్ చిత్రాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో నిధి పలు ఇంటర్వ్యూలో పాల్గొంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటోంది. తన హాట్ ఫొటోలను షేర్ చేస్తూ అభిమానులకు దగ్గరగా ఉంటుంది. తాజాగా, నిధి అగర్వాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. ఇందులో పింక్ కలర్ చీర కట్టుకున్న ఆమె లూజ్ హెయిర్ వేసుకుని కనిపించింది. పూర్తిగా సంప్రదాయంగా ఉండటంతో ఇప్పటి హీరోయిన్లు అంతా ఆఫర్ల కోసం బాడీ పార్ట్స్ చూపిస్తుంటే.. నువ్వు ఇలా కనిపిస్తావని ఊహించలేదని అంటున్నారు. అలాగే చాలా అందంగా ఉన్నావని కామెంట్లు చేస్తున్నారు.

